లక్కు ఎవరిదో..?

- నేడు కల్లుగీత ఉపకులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు లక్కీ డ్రా
- హిందూపురం, పుట్టపర్తిలో పోటాపోటీ
- జిల్లాలో తొమ్మిది షాపులకు 59 దరఖాస్తులు

పుట్టపర్తి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ కల్లుగీత ఉపకులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తుల లెక్కతేలింది. ప్రభుత్వం కల్లు గీత ఉప కులాలకు రిజర్వు చేస్తూ కేటాయించిన 9 ప్రైవేట్ మద్యం దుకాణా లకు 2024-26 లీజు కాలానికి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారులు గత ఈనెల 27 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గడువు శనివారం ముగియడం తో తొమ్మిది దుకాణాలకు 59 దరఖాస్తులతో ప్రభుత్వానికి రూ.1.18 కోట్ల ఆదాయం లభించింది. ఇక సోమవారం నిర్వహించే లక్కీ డ్రాపై అందరి చూపు పడింది. లక్కు ఎవరిదోననే ఉత్కంఠ నెలకొంది. దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల్లో కూటమి పార్టీ నేతలతోపాటు ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో సిండికేట్‌గా మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు కల్లు గీత ఉపకులాల్లో కొందరితో దరఖాస్తులు చేయించినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో లక్కీడ్రాలో ఎవరికి దుకాణం దక్కిన అందరికీ భాగమే అన్న చందగా మారింది. హిందూపురం మున్సిపాలిటీతోపాటు హిందూపురం, పుట్టపర్తి గ్రామీణ దుకాణాలకు కల్లు గీత ఉపకులాల్లో ఔత్సాహికులు పోటాపోటీగా దరఖాస్తులు చేశారు. మిగిలిన చోట్ల పెద్దగా దరఖాస్తులు చేయలేదంటే తెరవెనుక ఎంత ఒత్తిళ్ల పని చేశాయో ఊహించుకోవచ్చు. తాడిమర్రి, పెనుకొండ గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కొక్కటే దరఖాస్తులు దాఖల య్యాయి. దీంతో ఎవరు దరఖాస్తు చేశారో తెలిసిపోయింది. అయితే మిగిలిన ఏడు చోట్ల ఏ దుకాణానికి ఎవరు దాఖలు చేశారో తెలియకపోవడంతో ఆరాలు తీయడం మొదలు పెట్టారు.

తీవ్రపోటీ

కల్లుగీత కులాలకు జిల్లాలో ఆరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో తొమ్మిది మద్యం దుకాణాలను రిజర్వు చేస్తూ ఆయా కల్లుగీత ఉపకులాల్లో ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో కదిరి మున్సిపల్‌లో గౌడ కులం, తాడిమర్రిలో గౌడ కులస్థులకు ధర్మవరం, హిందూపురం మున్సిపాలిటీ, హిందూపురం రూరల్, చిలమత్తూరు, పుట్టపర్తి రూరల్, పెనుకొండ రూరల్, నంబులపూలకుంటలో ఏడు మద్యం దుకాణాలు ఈడిగ కులస్థులకు కేటాయించారు. హిందూపురం మున్సిపాలిటిలో 19, గ్రామీణలో 14, పుట్టపర్తి గ్రామీణలో 10 ధర్మవరంలో 4, చిలమత్తూరులో 5, కదిరిలో 3 ఎన్‌పీ కుంటలో 2 చెప్పున దరఖాస్తులు వచ్చాయి. పెనుకొండ గ్రామీణం, తాడిమర్రిలో ఒక్కో దరఖాస్తు మాత్రమే వచ్చాయి. ఈప్రాంతాల్లో దుకాణాలన్నీ సిండికేట్‌లోకే వెళ్లే లా పక్కా ప్రణాళికతో దరఖాస్తులు చేయించినట్లు సమాచారం. హిందూపురం, ధర్మవరం, చిలమత్తూరు, కదిరి ప్రాంతాల్లో దరఖాస్తులకు ముందుకు వచ్చిన కల్లు గీత ఉపకులాల్లో ఔత్సాహికులను సిండికేట్ వ్యాపారులు బెదిరించినట్లు సమాచారం. దీంతో కొందరు వెనుకడుగు వేసినా మరికొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం ఉండటంతో గోప్యంగా దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది.

అందరి చూపు.. ఆ దుకాణాలపైనే..!



జిల్లాలో తొమ్మిది కల్లు గీత ఉపకులాలకు కేటాయించిన రిజర్వ్‌డ్ మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించిన జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం లక్కీడ్రా నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి సాయి ఆరామంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉదయం ఎనిమిది గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభిస్తారు. హిందూపురం మున్సిపాలిటీ, హిందూపురం గ్రామీణ, పుట్టపర్తి, చిలమత్తూరు దుకాణాలకు పోటాపోటీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో ఎవరి దక్కుతాయోననే ఉత్కంఠ నెలకొంది. కాగా జిల్లాలో కల్లు గీత ఉపకులాలకు కేటాయించిన తొమ్మిది దుకాణాలకు సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలో లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి గోవిందనాయక్ తెలిపారు. దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించి, ఎంపికైన వారికి మద్యం దుకాణం లైసెన్సు కేటాయిస్తామన్నారు. దరఖాస్తుదారులను మాత్రమే లక్కీ డ్రాలోకి అనుమతిస్తామని వెల్లడించారు.

పెట్రోలు బొంకులు..!





బంకులో పెట్రోల్ పట్టించుకుంటున్న ద్విచక్రవాహనదారుడు

ప్రభుత్వం విధించిన నియమ, నిబంధనలను పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడం లేదు. చాలా బంకుల వద్ద కనీసం తాగునీటి సౌకర్యం, ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలను కూడా ఉంచడం లేదు. ఇక మరుగుదొడ్ల సంగతి సరేసరి. రీడింగ్‌లో మోసంతో తీసుకున్న డబ్బుకంటే తక్కువ పెట్రోలు పోస్తున్నా అడిగే నాథుడే లేడు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే వినియోగదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మోసాలు, తప్పులతో పెట్రోలు'బొంకు'లుగా మారాయనే విమర్శలు వినవస్తున్నాయి.

- అమలుకాని ప్రభుత్వ నిబంధనలు
- కనిపించని తాగునీరు, ఎయిర్‌ఫిల్లింగ్ యంత్రాలు
- తక్కువ పెట్రోలు వేస్తూ నిర్వాహకుల మోసం
- పర్యవేక్షణ మరచిన అధికారులు



ధర్మవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో నిబంధనలకు నీళ్లొదిలేశారు. వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రమాణాలు కూడా పాటించడంలేదు. తనిఖీ చేయాల్సిన అధికారులు వాటిపై కన్నెత్తి చూడటం లేదు. జిల్లాలో 81 పెట్రోల్ బంకులున్నాయి. వీటిలో 60శాతం బంకులలో కనీస వసతులు లేవు. ఎయిర్ ఫిల్లింగ్ పాయింట్లు అలంకారప్రాయంగా మారాయి. చాలా బంకుల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు తదితర సదుపాయాలు అస్సలు కానరావు. కొన్ని చోట్ల మాత్రం అలంకారప్రాయంగా ఉన్నాయి. వీటి ఏర్పాటుకు పెట్రోలియం కంపెనీలే నిధులు సమకూర్చుతున్నప్పటికీ 60 శాతం బంకుల్లో అలాంటివేవీ కనిపించడం లేదు. కొన్ని చోట్ల తక్కువ ఇంధనం నింపుతూ గుట్టుచప్పుడు కాకుండా దోచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాగునీటికి ఇబ్బందులు

పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కచ్చితంగా తాగునీటి సౌకర్యం కల్పించాలి. జిల్లాలోని పలు బంకుల్లో దాహం వేస్తే తాగడానికి నీటి సదుపాయం లేదన్న విమర్శలు వినియోగదారుల నుంచి వినిపిస్తున్నాయి. వాహనదారులతో పాటు సాధారణ ప్రజలు కూడా పెట్రోల్ బంకుల్లో మరుగు దొడ్లు వినియోగించుకోవచ్చు. జిల్లాలోని అనేక బంకుల్లో ఇవి ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి. కొన్నిచోట్ల తాగునీటి సౌకర్యం ఉన్నా సిబ్బంది మాత్రమే వాడుకుంటున్నారని వినియోగదారులు పేర్కొంటున్నారు.

అంతా మోసం



వాహనాలకు పెట్రోల్ నింపేటప్పుడు మోసాలకు పాల్పడుతున్నారు. పెట్రోల్ నింపేటప్పుడు 5 పాయింట్లపైనే మొదలు పెడతారు. ఇంకా మూడు పాయింట్లు ఉన్నట్లుగా నిలిపేస్తున్నారు. ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతారు. బంకుల్లో సిబ్బంది ఇంత మోసాలకు పాల్పడుతున్న సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు కలుగుతున్నాయి.

-జేవీ రమణ, ద్విచక్రవాహనదారుడు

తనిఖీలు శూన్యం

పెట్రోల్ బంకులలో అక్రమాలు జరుగుతున్నా తనిఖీ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలతో తూతూ మంత్రంగా తనిఖీలు చేసి ఆ ఫొటోలు సెల్‌ఫోన్‌లో తమ గ్రూపులో అప్‌లోడ్ చేసి చేతులు దులుపుకోవడం మినహా చేసేదేమీ లేదని ఆరోపణలు ఉన్నాయి.

బంకుల్లో అగ్నిమాపక పరికరాలు కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల ఇసుక బకెట్లతో సరిపెడుతున్నారు.

నిబంధనలు పాటించడం లేదు



పెట్రోల్ బంకుల్లో ఎవరూ నిబంధనలు పాటించలేదు. ఎక్కడా వాహనదారులకు తాగునీటి సౌకర్యం కల్పించలేదు. ద్విచక్రవాహనాల్లో పెట్రోల్ వేసేటప్పుడు వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. నేరుగా ఐదు పాయింట్ల నుంచి పెట్రోల్ పడుతూ వాహనదారులను మోసం చేస్తున్నారు. బంకుల్లో గాలిమిషన్లను దిష్టిబొమ్మల్లా ఉంచారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

-ఆనంద్, ద్విచక్రవాహనదారుడు, ముదిగుబ్బ

ధూమపానం, సెల్ వినియోగిస్తూ...

పెట్రోలు బంకుల్లో ధూమపానం, సెల్‌ఫోన్ వినియోగం నిషేధం. చాలా మంది వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ తమ వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోయించుకుంటున్నారు. ఇది అగ్ని ప్రమాదాలకు దారి తీసే ప్రమాదం ఉంది. కొన్ని

రీడింగ్‌లో మోసాలు

వాహనాలకు పెట్రోల్ లేదా డీజిల్ నింపేటప్పుడు బంకులో తిరిగే మీటర్ రూపాయలు ఐదుకు మించి జంప్ కాకూడదు. అంతకు మించితే మోసం చేసినట్లే. జిల్లాలోని అనేక బంకుల్లో మీటర్లలో వ్యత్యాసం భారీగా ఉంది. ఫలితంగా వాహనదారులు నష్టపోతున్నారు. పెట్రోల్ నాణ్యతపై వినియోగదారులకు సందేహాలు ఉంటే లిట్మస్ పేపరుతో పరీక్ష చేసి చూపాలి. అలా పరీక్షించినపుడు నలుసులు, దుమ్ము కనిపించకూడదు. జిల్లాలో చాలా చోట్ల సిబ్బందికి లిట్మస్ పరీక్ష గురించి తెలియదు.

దిష్టిబొమ్మల్లా ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలు

పెట్రోల్ బంకుల్లోని ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. వాహనదారుడు పెట్రోల్ నింపుకున్న అనంతరం టైర్లలో గాలి నింపుకోవడం కోసం ఎయిర్ ఫిల్లింగ్ యంత్రం దగ్గరకు వెళితే పని చేయడంలేదని నిర్వాహకులు చెబుతున్నారు. మరి కొందరు వాహనదారులు యంత్రాలు పనిచేయకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

తనిఖీలు నిర్వహిస్తాం: వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌ఓ

జిల్లాలో పెట్రోల్ బంకుల్లో నిబంధనలను పాటించని, సౌకర్యాలు లేని బంక్‌ల్లో తనిఖీలు నిర్వహిస్తాం. నిబంధనలు పాటించకున్నా, బంకుల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయకున్నా శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. వినియోగదారుల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యంగా పని చేస్తాం.

నులిమేద్దాం

నులి పురుగులతో ఆరోగ్యానికి చేటు

నేడు మాత్రల పంపిణీ... ఏర్పాట్లు పూర్తి

హిందూపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నివారణకు ఏటా ఫిబ్రవరి 10న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు వయసున్న వారికి ఈ మాత్రలు పంపిణీ చేయనున్నారు. నులిపురుగుల బారినపడి రక్తహీనత గురై అనారోగ్యాన్ని కొని తెచ్చుకునే పిల్లలు 60 శాతం మంది ఉన్నట్లు ఆరోగ్య సంస్థల నివేదికలో వెల్లడిస్తున్నాయి. బడి ఈడు పిల్లల్లో నట్టలతో రక్తహీనత, పౌష్టికాహారలోపం, శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతున్నాయి. చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'నులిపురుగులను నులిమేద్దాం' అనే నినాదంతో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నారు.

ప్రవేశం ఇలా..

బహిరంగ మలవిసర్జన ద్వారా వెలువడిన అనేక రకాలైన నట్టల గుడ్లు మట్టిలో చేరి అక్కడే పొదిగి వివిధ మార్గాల ద్వారా ఇతరుల జీర్ణాశయంలోకి ప్రవేశిస్తాయి. పిల్లలు తిన్న ఆహారాన్ని అవి తింటూ మనుగడ సాగిస్తుంటాయి. మనిషిని అనారోగ్యవంతుడిని చేస్తున్నాయి. వెరసి నిత్యం ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తోంది. మట్టిలో నడిచినపుడు శరీరంలో ప్రవేశించి జీర్ణాశయంలో నివాసాలు ఏర్పరుచుకుంటాయి.


ఉత్పన్నమయ్యే సమస్యలు..

నులిపురుగులు కడుపులో ఉంటే ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, కడుపు ఉబ్బరం, చర్మంపై దుద్దుర్లు, నిమోనియా రక్తహీనత, ఆయాసం, గుండె పరిమాణం పెరగడం, కాలువాపులు, మొహం ఉబ్బడం లాంటి ఆరోగ్య సమస్యలు కనిపిస్తాయి. జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు పంపిణీ చేస్తారు. జిల్లావ్యాప్తంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్నవారు 3,66,225 మంది ఉన్నారు. వీరందరికి మాత్రలను అందజేయనున్నారు.

పంట పండేదెలా..?

వేధిస్తున్న కరెంటు కోతలు

ఆందోళన చెందుతున్న రైతులు



పుట్టపర్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్‌కు కోతలు విధిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండాకాలం ప్రారంభం అవుతోంది. ఈ నేపథ్యంలో తడి ఎక్కువగా ఇస్తేనే పైరు ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే విద్యుత్ సరఫరాలో కోతలు ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే సాగు చేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలో 142600 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా రైతులు తమ పొలాల్లో పంటలు పండించుకుంటున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో రాత్రి పది గంటల తర్వాత విద్యుత్ సరఫరా చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయానికి ఏడు గంటలు విద్యుత్ సరఫరా అవుతుంది. అది కూడా ఏడుగంటలు నిరంతరాయంగా కాకుండా మూడు లేదా నాలుగు గంటలు సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

కష్టాలు పడుతున్నాం..



వేళాపాళా లేకుండా కరెంటు కోతలు విధిస్తుండటంతో కష్టాలు పడుతున్నాం. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. మూడెకరాలలో వేరుశనగ సాగు చేశా. కరెంటు సరఫరా సరిగా లేకపోవడంతో పంట ఎండిపోయే పరిస్థితి వచ్చింది. దీనిపై అధికారులు స్పందించి రైతులకు అనుకూలంగా విద్యుత్ సరఫరా చేయాలి.

-విశ్వనాథ్‌రెడ్డి, రైతు, ముచ్చురామి, ధర్మవరం మండలం

9 గంటలు విద్యుత్ ఇవ్వాలి..



నిరంతరాయంగా 9గంటలు విద్యుత్ సరఫరా చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. అలా కాకుండా రెండు గంటలు తగ్గించి విడతల వారిగా సరఫరా చేస్తున్నారు. దీంతో పంటలకు సక్రమంగా నీరు అందడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

-రమేశ్, రైతు, కోనాపురం, పెనుకొండ మండలం

బోరులో నీరున్నా..



బోరు బావిలో పుష్కలంగా నీరు ఉన్న విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల పంటలు పూర్తిస్థాయిలో సాగు చేయలేకపోతున్నాం. నాకు ఐదెకరా పొలం ఉన్నా వేసవిలో విద్యుత్ కోతలతో రెండు ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేశా. మిరప, మొక్కజొన్న పంటలు సాగు చేశా. 9 గంటలు విద్యుత్ సరఫ రా చేస్తే మరింత భూమిని సాగు చేసే అవకాశం ఉండేది.

-యోగీశ్వర్, రైతు, సీ.కొడిగేపల్లి, మడకశిర మండలం

టమోటాకు నీరు అందించలేకపోతున్నా..





నాలుగు లక్షలు పెట్టుబడి పెట్టి నాలుగు ఎకరాల్లో టమోట సాగు చేశా. విద్యుత్ కోతల వల్ల పంటకు పుష్కలంగా నీరు అందించలేకపోతున్నా. ఎక్కడో దూరంగా ఉన్న కొక్కంటి క్రాస్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ఉండటంతో లో ఓల్టేజ్ సమస్య తలెత్తుతోంది. దీంతో మోటార్లు సరిగా పని చేయడం లేదు. మా ప్రాంతంలోనే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- చాంద్‌బాషా, రైతు, కొర్తికోట, తనకల్లు మండలం

నాణ్యమైన విద్యుత్ అందించాలి



వ్యవసాయానికి అరకొర విద్యుత్ సరఫరా చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో పాముల భయంతో వ్యవసాయ తోటలో నీటిని పారపెట్టేందుకు వెళ్లడానికి భయందోళన చెందు తున్నారు. పగటి పూటే 9గంటలు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలి.

- జంగాలపల్లి పెద్దన్న, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు, ధర్మవరం



లో ఓల్టేజ్ నివారణకు చర్యలు

జిల్లాలో లో ఓల్టేజీ నివారణకు కొత్తగా 25 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 40 ట్రాన్స్‌ఫార్లర్లు మంజూరయ్యాయి. త్వరలో వీటిని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చేత పంపిణీ చేయిస్తాం. లోఓల్టేజీ నివారణకు సంబంధించి ఇప్పటికే ఆయా ఫీడర్లలో మార్పులు కూడా చేస్తున్నాం.

- శివరాములు, డీఈ

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

కొత్తచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని డీఐఈఓ రఘునాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్స్ ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

పెనుకొండ శిల్ప కళ అద్భుతం



గౌరీలక్ష్మీబాయికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెనుకొండ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య రెండో రాజధాని పెనుకొండలో ప్రాచీన కట్టడాలు, దేవాలయాలపై శిల్ప కళ అద్భుతమని కేరళ ట్రావెన్‌కోర్ సంస్థాన రాజవంశీకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత అశ్వతి తిరునాళ్ గౌరీ లక్ష్మీబాయి పేర్కొన్నారు. చరిత్ర పరిశోధకుడు మైనాస్వామితో కలిసి ఆమె ఆదివారం పెనుకొండలోని రాయలకాలంనాటి కోట గోడలు, భవనాలు, ఆలయాలను సందర్శించారు. కోటగోడలోని ఆలయాల్లో శిలాశాసనాల గురించి చరిత్రకారుడు మైనాస్వామి వివరించారు. 1405 నాటి ఐముక్తేశ్వర, 1510 నాటి కాశీవిశ్వేశ్వర, రామభద్రాలయాలను ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. విజయనగర రాజుల కాలంనాటి శిల్పకళ అద్భుతమని కొనియాడారు. కాశీ విశ్వేశ్వరాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డా.రంగనాథ్‌రెడ్డి, అర్చకులడు చంద్రశేఖర్.. ఆమెను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

మోస్ట్ వాంటెడ్ ధార్ గ్యాంగ్..

60 మంది సభ్యులు..
అందరిపైనా పదుల సంఖ్యలో కేసులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాకి చెందిన దొంగల ముఠా అంటే దేశవ్యాప్తంగా చోరీలకు పెట్టింది పేరు. 60 మంది సభ్యులున్న ఈ ముఠా ఆగడాలను వింటే హడలెత్తిపోవాల్సిందే. వీరు ఎక్కడికైనా వెళ్లారంటే భారీ చోరీలకు పాల్పడతారు. ముఠా సభ్యులందరిపై పదుల సంఖ్యలో కేసులున్నాయి. చాలామంది జైళ్లలో ఉన్నారని తెలిసింది. ఎన్ని కేసులున్నా.. ఎన్నిసార్లు జైలుకు వెళ్లొచ్చినా చోరీలను మాత్రం ఆపరని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. అనంతపురం నగర శివారులోని రాజహంస స్వీట్ హోమ్స్‌లోని మూడు విల్లాస్‌లలో గత నెల 21న భారీ చోరీ ధార్ గ్యాంగ్ పనేనని పోలీసులు తేల్చారు. ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ వెల్లడించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు ఛేదింపు వివరాలను ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి 59తులాల బంగారు ఆభరణాలు, రూ.19.35 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, నగలను పరిశీలిస్తున్న ఎస్పీ, సిబ్బంది

అపహరించిన బైక్‌లలో..

మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా చడ్‌వాడ్ గ్రామానికి చెందిన నారు పచావర్, సావన్, అదే జిల్లాకు చెందిన మహబత్, మోట్ల ముఠాగా ఏర్పడ్డారు. గతనెల 16న స్వగ్రామం నుంచి బయలుదేరి ఇండోర్, ఇటార్సి వరకు బస్సులో వచ్చారు. అక్కడి నుంచి నేరుగా తమిళనాడులో సేలంకు రైలులో చేరుకున్నారు. అటు నుంచి ధర్మపురికి వెళ్లి రెండు బైక్‌లను అపహరించారు. బెంగుళూరు మీదుగా ఆ బైక్‌లలో శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వైపు వచ్చారు. పెనుకొండ సమీపంలో వీరు వస్తున్న బైక్‌లలో ఒక దానికి రిపేరీ రావడంతో వదిలేశారు. సమీపంలో మరో బైక్ అపహరించి అనంతపురం చేరుకున్నారు. నగరంలో రెక్కీ నిర్వహించారు. శివారులోని రాజహంస స్వీట్ హోమ్స్‌లోని వెంకటశివారెడ్డి, రంజిత్‌రెడ్డి, శివశంకర్‌నాయుడుకు చెందిన విల్లాస్‌లలో గతనెల 21న రాత్రి చోరీలు చేశారు. మొత్తం రూ.2.13కోట్లకుపైగా విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలను అపహరించారు. దీనిపై అనంతపురం ఎస్పీ జగదీష్ ప్రత్యేక దృష్టి సారించారు. నాలుగు పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐలు సాయినాథ్, హేమంత్‌కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్‌ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి దొంగల కోసం వేట మొదలు పెట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ, టోల్‌గేట్ల వద్ద లభించిన ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. దొంగల ఫింగర్ ప్రింట్స్ ఆధారంగానే వారి మొబైల్ నంబర్లను ట్రేస్ చేసినట్లు సమాచారం.

విక్రయించే ప్రయత్నంలో..

అనంతపురంలో చోరీ చేశాక బైక్‌లలోనే నిందితులు హైదరాబాద్ వెళ్లారు. నలుగురు వాటాగా పంచుకున్నారు. వారిలో నారు పచావర్, సావన్ హైదరాబాద్, బెంగుళూరులో సొత్తును విక్రయించే ప్రయత్నం చేసినా కుదర్లేదు. దీంతో కీలక వ్యక్తి మధ్యప్రదేశ్‌కు చెందిన రమేష్‌ను సంప్రదించారు. చోరీ సొమ్ము కొనాలని కోరారు. అందుకు అతడు.. తన కొడుకు సునీల్‌ను పంపాడు. ఈ ముగ్గురు అనంతపురం నగరంలోని రాయల్‌నగర్‌లో ఉండగా పోలీసులు పట్టుకున్నారు. అటు మహమత్, మోట్ల దొంగసొత్తులు పంచుకున్నాక స్వగ్రామానికి వెళ్లారు.

అందరిపైనా కేసులు..

ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురు, పరారీలో ఉన్న మరో ఇద్దరు కూడా పాత నేరస్తులే. ఈ ఐదుగురిలో నారు పచావర్, మహబత్ కీలకం. ఇద్దరూ స్వయానా అన్నదమ్ములు. వారి ముగ్గురు సోదరులు సైతం నేరస్తులే. వారంతా హైదరాబాద్‌లోని జైలులో ఉంటున్నారు. పచావర్‌పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో 32 కేసులున్నాయి. మహబత్‌పై నాలుగు రాష్ట్రాల్లో 29కిపైగా కేసులు నమోదయ్యాయి. సావన్, సునీల్, మోట్లపై కేసులున్నాయి. సునీల్‌పై 9, అతడి తండ్రి రమేష్‌పై ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాల్లో 32 కేసులున్నాయి. ఈ గ్యాంగ్ అంతా ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉంటోంది. మొత్తం ఈ గ్యాంగ్‌లో 60మంది సభ్యులుగా ఉంటారు. వీరంతా మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా టాండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వారే. ఐదారుగురు కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి చోరీలు చేస్తారు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ ప్రవృత్తిగా చోరీలకు పాల్పడతారు. పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి చోరీలు చేస్తుంటారు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసుకుని, వ్యసనాలకు బానిసలై, వాటిని తీర్చుకోవడానికి చోరీల బాట పట్టారు.

సొత్తంతా రమేష్‌కే విక్రయం...

తాళం వేసిన ఇళ్లలో చోరీ చేసిన సొత్తులను గ్యాంగ్ సభ్యులు.. రమేష్‌కు విక్రయిస్తారు. బంగారు ఆభరణాలు, వస్తువులు క్రయవిక్రయాల్లో తూకం వేస్తారు. రమేష్‌తో బేరంలో అవన్నీ సాగవు. దొంగ సొత్తును తూకం కూడా వేయకుండా తోచినట్లు లెక్కకట్టి డబ్బు ఇస్తాడట.

ఎస్పీ ప్రశంస...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉంటూ పలు చోరీలకు పాల్పడిన ధార్ గ్యాంగ్‌ను అరెస్టు చేసిన అనంత పోలీసు అధికారులను ఎస్పీ ప్రశంసించారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సాయినాథ్, హేమంత్‌కుమార్, జయపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

రాష్ట్ర పోటీల్లో ఫైనల్‌కు చేరిన కడప, అనంతపురం జట్లు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 15వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆదివారం నెల్లూరు, గుంటూరు జట్లు తలపడగా 3-0 తేడాతో నెల్లూరు, అనంతపురం, తిరుపతి జట్ల మధ్య జరిగిన పోటీలో అనంతపురం 1-0 తేడాతో, అనకాపల్లి, నెల్లూరు మధ్య మ్యాచ్‌లో అనకాపల్లి 3-0 తేడాతో విజయం సాధించాయి. విశాఖపట్నం, కర్నూలు జట్ల పోటీలో విశాఖపట్నం 8-0 తేడాతో, సత్యసాయి, శ్రీకాకుళం జిల్లా జట్ల పోటీలో శ్రీకాకుళం 2-1 తేడాతో, ప్రకాశం, ఎన్‌టీఆర్ జిల్లా పోటీలో ప్రశాకం జట్టు 1-0 తేడాతో గెలుపొందాయి. కాకినాడు-సత్యసాయి జిల్లాల పోటీలో కాకినాడ 2-0 గోల్స్‌తో, అనకాపల్లి-గుంటూరు మ్యాచ్‌లో అనకాపల్లి 9-0గోల్స్‌తో, తిరుపతి-ఎన్‌టీఆర్ జిల్లా పోటీలో తిరుపతి 2-0గోల్స్‌తో విజేతలుగా నిలిచాయి. కడప-విశాఖపట్నం పోటీలో కడప 3-0గోల్స్‌తో, కాకినాడ-శ్రీకాకుళం జిల్లాల పోటీలో కాకినాడ 6-0 గోల్స్‌తో విజయం సాధించాయి. అనంతపురం జట్టు ఎన్‌టీఆర్ జిల్లా జట్టుపై 6-0 గోల్స్‌తో, తిరుపతి జట్టు ప్రకాశం జట్టుపై 3-1గోల్స్‌తో, కడప జట్టు కర్నూలుపై 7-0 గోల్స్‌తో జయభేరి మోగించాయి. సాయంత్రం జరిగిన సెమీఫైనల్స్ మొదటి మ్యాచ్ కాకినాడ, కడప జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. కడప జట్టు 5-4 గోల్స్ తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో మ్యాచ్‌లో అనకాపల్లి, అనంతపురం జట్లు తలపడగా ఈ పోటీ కూడా చివరి వరకు హోరాహోరీగా సాగింది. చివరలో అనంతపురం జట్టు ఆధిక్యత ప్రదర్శించి 3-2 గోల్స్ తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. సోమవారం మూడవ స్థానం కోసం కాకినాడ-అనకాపల్లి జట్లు తలపడనుండగా, ఫైనల్స్‌లో కడప, అనంతపురం జట్లు ఢీకొననున్నాయి. హాకీ ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను ఆ సంఘం కార్యనిర్వహక కార్యదర్శి పీ థామస్ పీటర్, కార్యదర్శి పీ జగన్మోహన్, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదివారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పదిరోజుల పాటు పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని అధికారులు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కొనసాగుతుందని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్నిశాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

పామిడిలో 20 తులాల బంగారం చోరీ

పామిడి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పామిడిలోని వెంగమనాయుడు కాలనీలో శనివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన శ్రీనివాసరెడ్డి ఫొటోగ్రాఫర్‌గా జీవనం కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కసాపురం ఆంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లారు. ఇదే అదునుగా దుండగులు ఇంటిలోకి చొరబడి బీరువా తలుపులు పగులగొట్టి అందులోని 20 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వస్త్ర దుకాణంలో మోసం

శింగనమల ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఫోన్‌పే నకిలీ స్క్రీన్ షాట్ చూపి ముగ్గురు మహిళలు వస్త్ర దుకాణ యజమానిని మోసం చేశారు. యజమాని హుస్సేన్ తెలిపిన మేరకు.. ఆదివారం సాయంత్రం శింగనమల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న వస్త్ర దుకాణానికి ముగ్గురు మహిళలు కారులో వచ్చారు. అరగంటలో రూ.6,200 విలువగల డ్రస్సులు, చీరలు తీసుకున్నారు. డబ్బులు వేస్తామని చెప్పి ఫోన్‌పే స్కాన్ చేశారు. రూ.6,200 గతంలో ఎక్కడో వేసిన స్క్రీన్‌షాట్‌ను యజమానికి చూపారు. పనిలో ఉండి వచ్చిందిలే అనుకున్నాడు. వెంటనే ఆ ముగ్గురు కారులో వెళ్లిపోయారు. అరగంట తరువాత వచ్చిన యజమాని కుమారుడు ఖాతాలో డబ్బులు జమ కాలేదని గ్రహించాడు. ఈ ముగ్గురు దుకాణంలో చీరలు, డ్రస్సులు తీసుకున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయి ఉండడంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా... దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసులు

అవినీతి రూ.1.5 కోట్లు.. రూ.18.74 లక్షలకే ఫిర్యాదు
మరికొందరిని వదిలేయడంపై అనుమానాలు

విడపనకల్లు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమార్కులపై ఆ శాఖ అధికారులు చర్యలకు దిగారు. మండలంలోని పాల్తూరు, ఆర్.కొట్టాల, కరకముక్కల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. విడపనకల్లు మండలానికి చెందిన ఉపాధి హామీ పథకం ఏపీఓ సంజీవకుమార్ రూ. 5,33,625, ఇన్‌చార్జి ఏపీఓ రామ్మోహన్ రూ. 1,23,051, బీఎఫ్‌టీ హెచ్.రామాంజనేయులు రూ. 46,402లు, సీఓలు దాసప్పగారి ధనుంజయ రూ. 1,06,243, సుభాన్ రూ. 4,42,569, ఫీల్డ్ అసిస్టెంట్లు డి.రామస్వామి రూ.1,22,407, గురుస్వామి రూ.4,45,583, బి.మంజునాథ రూ. 54,514 అవినీతికి పాల్పడినట్లు పేర్కొంటూ వీరిపై శనివారం విడపనకల్లు పోలీస్ స్టేషన్‌లో ఎంపీడీఓ షకీలాబేగం ఫిర్యాదు చేశారు. 2023-24వ సంవత్సరం జరిగిన ఉపాధి హామీ పనులపై గత డిసెంబరు 3న సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన ఉపాధి హామీ సిబ్బంది బోగస్ జాబ్‌కార్డులను సృష్టించి పాల్తూరు గ్రామంలోనే రూ. 28 లక్షలు అవినీతి చేసినట్లు నిగ్గు తేల్చారు. ఆర్.కొట్టాల-డొనేకల్లు రోడ్డు వేయకున్నా వేసినట్లు ఎం.బుక్‌లు రికార్డు చేసి సుమారు రూ. 32లక్షలు డ్రా చేశారు. పై స్థాయి అధికారులను వదిలేసి కింది స్థాయి సిబ్బందిపై మాత్రమే క్రిమినల్ కేసులు నమోదు చేయటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో రూ. 1.50 కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ అధికారులు నిగ్గు తేల్చగా.. కేవలం రూ. 18 లక్షలు అవినీతి జరిగిందని కింది స్థాయి సిబ్బందిపై కేసులు పెట్టడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి పీఓ, పీఆర్ ఏఈ పై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



విజేతలకు షీల్డ్, ట్రోఫీ అందజేస్తున్న రైల్వే సీఐ కుమార్

ధర్మవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చెస్ టోర్నీ వల్ల క్రీడాకారుల్లో ఏకాగ్రతతో పాటు మేధస్సు కూడా పెంపొందుతుందని రైల్వే సీఐ బోయకుమార్, ఏపీ చెస్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుమన్ పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేట శ్రీఉషోదయ ఇంగ్లీష మీడియం పాఠశాలలో హైబ్రో చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ధర్మవరం వాసి దుర్గాప్రసాద్ ప్రథమ బహుమతి సాధించగా, ద్వితీయ బహుమతి అఫ్రీద్‌ఖాన్, తృతీయ బహుమతి భరత్‌భూషణ్ కైవసం చేసుకున్నారు. వీరికి రైల్వే ముఖ్య అతిథులు బహుమతులు, షీల్డ్ అందజేశారు. యువర్స్ ఫౌండేషన్ సహకారంతో హైబ్రో చెస్ అకాడమి నేతృత్వంలో 7వ రాష్ట్రస్థాయిఓపెన్ చెస్ టోర్నీ ఉత్కంఠ భరితంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 270 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, ఉపాధ్యక్షుడు సుంకుకుమార్, ట్రెజరర్ మోహన్, ఇంకా.. చాంద్‌బాషా, డాక్టర్ బీవీ సుబ్బారావు, జాకీర్‌హుస్సేన్, శ్రీనివాసులు, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ఆత్మహత్యల పర్వం

జిల్లాలో వేర్వేరుచోట్ల ఐదుగురి బలవన్మరణం

అనంతపురం క్రైం/సెంట్రల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల ఆదివారం ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రేమ పేరుతో ఓ యువకుడి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఇటుకలపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి ఎస్సీ కాలనీలో రామచంద్ర కుమార్తె కడవ శిరీష (21) డిగ్రీ పూర్తి చేసింది. అదే గ్రామానికి చెందిన పిన్నదరి పోతులయ్య కుమారుడు వంశీ శిరీషను ప్రేమ పేరుతో వేధించేవాడు. దీంతో మనస్తాపం చెందిన శిరీష ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇటుకలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, యువతి ఆత్మహత్యకు కారణమైన వంశీ అనే యువకుడిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు.

బుడ్డప్పనగర్‌లో మహిళ..

అనంతపురం నగరంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానిక బుడ్డప్పనగర్‌కు చెందిన శ్యామల (29) ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ ఉద్యోగిని..

పదవీ విరమణ పొందిన ఓ మహిళ అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. నగర శివారులోని బళ్లారి రోడ్డు స్ప్రింగ్ ఫ్యాక్టరీ సమీపంలో కొప్పాల లక్ష్మీదేవమ్మ(75) నివాసముంటోంది. ఆమె అటెండర్‌గా పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. భర్త సంజీవయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వారిలో కుమార్తె తులసమ్మ ఇంట్లో నివాసముంటున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన లక్ష్మీదేవమ్మ కుమార్తె, అల్లుడు ఫంక్షన్‌కు వెళ్లిన సమయంలో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

మేడాపురంలో మరొకరు..

చెన్నేకొత్తపల్లి: ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మేడాపురం గ్రామం లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన మట్టా ప్రకాశ్(40) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకున్నాడు. చుట్టుప్రక్కల వారు గమనించి ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సాయిలీల, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



మట్టా ప్రకాశ్(ఫైల్)

నిప్పంటించుకుని యువకుడు..

అనంతపురం క్రైం: నగర శివారులోని నేషనల్ పార్కు సమీపంలోని పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని యువకుడు అభిలాష్(26) మృతిచెందాడు. ఇదివరకు ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తుండేవాడు. ఆదివారం రాత్రి 8.30గంటల సమయంలో శిల్పారామానికి కిలోమీటర్ దూరంలోని రైల్వే ట్రాక్ సమీపంలో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర కాలిన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అభిలాష్ నగరంలోని పాతూరు వాసి అని తెలుస్తోంది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడని సమాచారం. ఆ అమ్మాయికి నిశ్చితార్థం అయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మనస్తాపం చెంది అభిలాష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆత్మహత్య చేసుకున్నాడా..? ఎవరైనా పెట్రోలు పోసి నిప్పంటించారా..? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కాగా అటు త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీసు స్టేషన్లకు సంబంధించి ఎవరి పరిధిలోకి వస్తుందో స్పష్టత రాలేదట. ఇరు స్టేషన్లకు చెందిన పోలీసులు రాత్రి 10.30 గంటలకు మృతదేహం వద్దకు వెళ్లారు.



అభిలాష్ (ఫైల్)

టీడీపీ, వైసీపీ నాయకుల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు



దాడిలో గాయపడిన టీడీపీ నాయకుడు బోర్ల చెన్నప్ప

కనగానపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల, గుంతపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం తగరకుంట గ్రామంలో పరస్పరం దాడులు చేసుకున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. తూంచెర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోర్ల చెన్నప్ప వ్యక్తిగత పనిమీద తగరకుంటకు వెళ్లాడు. అక్కడ వెల్డింగ్‌షాపు యజమాని అప్పు ఉండటంతో డబ్బుల కోసం చెన్నప్ప వెల్డింగ్‌షాపు వద్దకు వెళ్లాడు. అంతకు ముందే గుంతపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నరసింహ, ఆనందరెడ్డితో పాటు మరో ముగ్గురు వెల్డింగ్‌షాపు వద్ద ఉన్నారు. ఈ క్రమంలో ఒకరికొకరు కవ్వింపు చర్యలకు పాల్పడి గొడవపడ్డారు. దీంతో ఇరువురు ఒకరిపై ఒకరు కట్టెలు, మచ్చుకత్తితో దాడులు చేసుకున్నారు. దీంతో నరసింహకు కాలుకు, బోర్ల చెన్నప్ప తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఇద్దరిని అనంతపురంలోని వేర్వేరు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు.

సామాజిక స్పృహ కలిగిన రచయిత జూపల్లి

- పుస్తకావిష్కరణ సభలో వక్తలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9:(ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహ కలిగిన రచయిత జూపల్లి ప్రేమ్‌చంద్ అని పలువురు వక్తలు కొనియాడారు. అవేద, నిచ్చెనమెట్ల లోలకం తదితర గ్రంథాల ద్వారా తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆదివారం ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోంలో జూపల్లి ప్రేమ్‌చంద్ రచించిన 'ఆధునిక తెలుగు వచన కవిత్వం - విభిన్న ధోరణులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రేమ్‌చంద్ చైతన్యవంతమైన సాహిత్యాన్ని అందించారని అన్నారు. ఆధునిక తెలుగు కవిత్వంలో వచ్చిన ధోరణులను నిశితంగా పరిశీలించి భావితరాలకు గొప్ప సిద్ధాంత గ్రంథాన్ని అందించారన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సాహితీకారులు జంగా గౌతమ్, తూముచర్ల రాజారామ్, ఉప్పరపాటి వెంకటేశులు, నానీల నాగేంద్ర, జూపల్లి ప్రేమ్‌చంద్ సతీమణి రాజేశ్వరి, ఆయన సంతానం శంతన్, అపర్ణతోపాటు నాగలింగయ్య, తన్నీరు నాగేంద్ర, షేక్ నబిరసూల్, రియాజుద్దీన్, జూటూరు షరీఫ్, మధురశ్రీ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

న్యూస్ బాక్స్

టాలెంట్ టెస్టులో స్టేట్ ర్యాంకులు



మెమెంటో, సర్టిఫికెట్ అందుకొంటున్న ధర్మవరం విద్యార్థి

ధర్మవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ ఎపిఫని మెరిట్ టాలెంట్ టెస్టులో స్టేట్ మొదటి ర్యాంకులను ధర్మవరం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించినట్టు ఆ పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఎడ్యుకేషన్ ఎపిఫని మెరిట్ టెస్టు -2025 (ఈఈఎంటీ)లో తమ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి దాసరి లలితేష్, 8వతరగతి విద్యార్థి ఉక్కిసిల ఓబుళేశు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారన్నారు. శనివారం విజయవాడలో జరిగిన ర్యాంకుల ప్రదాన సభలో వీరికి రాష్ట్ర సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య, కోడ్ తంత్ర అధినేత రమణ చేతులమీదుగా మెమెంటో, సర్టిఫికెట్, రూ.30వేల చెక్కులు అందుకున్నట్టు పాఠశాల హెచ్ఎం తెలిపారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరిక

ధర్మవరం,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగలూరులోని వైసీపీకి చెందిన 50 కుటుంబాల సభ్యులు జనసేన పార్టీలో ఆదివారం చేరారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

కుట్టుమిషన్ అందజేత

కొత్తచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీకాలనీకి చెందిన శిరీషకు కిజ్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంతోష్ సహకారంతో కుట్టుమిషన్‌ను ఆదివారం అందజేశారు. ఈ కుట్టుమిషన్‌ను మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ చేతులమీదుగా అందజేశారు. శిరీష భర్త శివ ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబపోషణ కష్టంగా ఉండటంతో.. శిరీషకు చిన్నప్పోళ్ల సంతోష్ కుట్టుమిషన్‌ను అందజేశారు.

రైతులు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న రైతుల భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ నీలకంఠారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ నెంబరు 30 ప్రకారం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబరు వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

శ్రీకృష్ణ మందిరం నిర్మాణానికి లక్ష విరాళం

ముదిగుబ్బ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కదిరిలో శ్రీకృష్ణ మందిరం, యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు రూ. లక్షను విరాళం అందజేసినట్లు ముదిగుబ్బ మండలం మద్దన్నగారిపల్లికు చినగాని నరసింహయాదవ్ తెలిపారు. ఆదివారం శ్రీకృష్ణసాయి వెల్ఫేర్ సొసైటీ అకౌంట్‌కు ఆ నగదు బదిలీ చేసినట్లు చెప్పారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవారం జరిగే వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే పీఆర్ఓ ఎద్దుల సంతోష్‌రెడ్డి, మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు చౌడంపల్లిలో నిర్వహించే రామాలయ విగ్రహ ప్రతిష్ఠ, 3.30 గంటకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ, రాత్రి 7గంటలకు అచ్చామియా పల్లిలో జరిగే ఉరుసు ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు.

● నేడు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల అందజేత

కొత్తచెరువు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సోమవారం అంద జేస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం నుంచి 28 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూర య్యాయని, వాటిని కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలకు చెందిన రైతులకు అందజేస్తారని తెలిపింది.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



సునీల్‌కుమార్ (ఫైల్)

కదిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం జొన్నకాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్ (40) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. ఆయన స్వగ్రామమైన సిద్దగూరు పల్లిలో సాయంత్రం ఆయన చాతి నొప్పితో కుప్ప కూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు ఆల్బెండజోల్ పంపిణీ

నల్లమాడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్న వారికి సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామని రెడ్డిపల్లి వైద్యురాలు దీప్తి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం 64 ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలలు, 83 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 7,468 మంది విద్యార్థులకు వీటిని అందజేస్తామన్నారు. మిగిలిన విద్యార్థులకు 17న అందచేస్తామన్నారు.

ఎస్ఐని నియమించండి

గాండ్లపెంట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలానికి ఎస్ఐ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల క్రితం ఇక్కడి ఎస్ఐ క్రిష్ణవేణి బదిలీపై తాడిమర్రికి వెళ్లారు. ఏఎస్ఐగా పనిచేస్తున్న రంగనాయక్ ఉద్యోన్నతిపై బదిలీపై కొత్తచెరువుకు వెళ్లారు. ఎస్ఐ, ఏఎస్ఐ లేకపోవడంతో వివిధ సమస్యలపై వస్తున్న ప్రజలు సమస్యలు ఎవరికి విన్నవించుకోలో తెలియడంలేదని ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గాండ్లపెంట పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐని నియమించాలని కోరుతున్నారు.

ఘనంగా అచ్చామియా గంధోత్సవం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చామియా పల్లిలో హజరత్ ఖాజా సయ్యద్‌షా అబుల్‌హసేన్ అచ్చామియాసాహెబ్ 433వ ఉరుసు గంధోత్సవాన్ని ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గంధాన్ని కొండకమర్ల గ్రామానికి చెందిన మాజీ ఫైన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జౌలి అల్లాబక్ష, మాజీ ఎంపీపీ ఇస్మాయిల్ ఇంటి నుంచి ఫక్కీర్ల జల్సాలతో ఊరే గింపుగా అచ్చామియా పల్లి వరకు తీసుకెళ్ళి. అచ్చామియా సాహెబ్‌కు సమర్పించారు. గంధోత్సవం సందర్భంగా క్రేజీబాయ్స్ ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉరుసు ఉత్సవాన్ని నిర్వహిస్తామని పీఠాధిపతులు తెలిపారు. ఉరుసు సందర్భంగా భక్తులకు అన్నదానం, గొప్ప ఖవాలీ కార్యక్రమాన్ని ఉంటుందన్నారు.



జల్సాలతో గంధాన్ని తీసుకొస్తున్న ఫకీర్లు

పీఠంపై ఆశలు

● మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిపై ఉత్కంఠ
● బీసీ మహిళకు రిజర్వేషన్ ఖరారు
● పలువురు కూటమి నేతల్లో ఆశలు
● వైసీపీ హయాంలో నియమించని వైనం



ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మార్కెట్ యార్డుకు పూర్వవైభవం రాబోతోంది. మార్కెట్ యార్డు చైర్మన్ స్థానాన్ని త్వరలో భర్తీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే నామినేటెడ్ పదవులపై దృష్టిసారించింది. దీంతో మార్కెట్ యార్డు చైర్మన్ల ఎంపిక కోసం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు మార్కెట్‌శాఖ అధికారులు తెలిపారు. ధర్మవరం మార్కెట్‌యార్డు చైర్మన్ కోసం బీసీ మహిళ రిజర్వేషన్ ఖరారు కావడంతో కూటమి నేతల్లో ఆశలు చిగురించాయి. నియోజకవర్గ స్థాయి ప్రోటోకాల్ పదవి కాబట్టి దానిపై టీడీపీ నాయకులతో పాటు బీజేపీ నేతలు కూడా ఆశలు పెట్టుకున్నారు. శాసనసభ్యుడి ఆమోదం మేరకు జరిగే ఎంపికపై ఆ పదవి ఎవరికి వరిస్తుందోనని జోరుగా చర్చ జరుగుతోంది.

● వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

గత టీడీపీ హాయంలో మార్కెట్‌యార్డు చైర్మన్‌గా కమతం కాటమయ్య ఉన్నారు. అప్పట్లో మార్కెట్ యార్డు అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి మంచి గుర్తింపు తెచ్చారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు మార్కెట్ యార్డు చైర్మన్‌ను నియమించలేదు. దీంతో యార్డ్‌కు వచ్చే ఆదాయాన్ని, రైతులకు ఉపయోగం లేకుండా చేసి నిర్వీర్యం చేసింది. వైసీపీ ప్రభుత్వం చైర్మన్ల ఎంపిక చేపట్టాలన్నా... ఇక్కడ మాత్రం నాటి శాసనసభ్యుడు మొగ్గుచూపకపోవడంతో చైర్మన్ ఎంపిక జరగలేదు. అయితే ఈ సారి కూటమి ప్రభుత్వంలో చైర్మన్ ఎంపిక చేస్తారని ప్రచారం జరుగుతోంది.

● కూటమి నేతల్లో ఆశలు

ఎమ్మెల్యే తర్వాత నియోజకవర్గస్థాయి ప్రోటోకాల్ పదవి కావడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు నేతలు మార్కెట్ యార్డు చైర్మన్ స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ నాయకులతో ఇబ్బందులు పడి గత ఐదేళ్లు పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని, మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను గెలుపించుకోవడం కోసం ఎంతో శ్రమించామని, కావున చైర్మన్ పదవి తమకే ఇవ్వాలని పలువురు టీడీపీ నాయకులు చర్చించుకుంటున్నారు. అయితే ఎన్నికల ముందు వైసీపీని వీడి బీజేపీలోకి వచ్చిన వారు కూడా చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం. కూటమిలో భాగంగా అందరి సమన్వయంతో పదవి ఎంపిక జరిగితే బాగుంటుందని కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా మంత్రి సత్యకుమార్ ఎవరికి మొగ్గుచూపుతారో.. ఆ పదవి ఎవరికి వరిస్తుందోనని జోరుగా చర్చ జరుగుతోంది.

● రిజర్వేషన్ ఖరారు

ధర్మవరం మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి కోసం బీసీ(మహిళ) రిజర్వేషన్‌ను జిల్లా ఉన్నతాధికారులు ఖరారు చేసినట్లు మార్కెట్‌శాఖ అధికారులు తెలిపారు. మార్కెట్ యార్డుకు చైర్మన్‌తో పాటు వైస్‌చైర్మన్, మరో 13 మంది సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. వాటిని కూడా అన్నికులాలను పరిగణలోకి తీసుకుని రిజర్వేషన్ ప్రకారం నియమిస్తారు. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలే ఉండటంతో చైర్మన్ స్థానానికి బీసీలను ఎంపిక చేసినట్లు సమాచారం.

● మంచి గుర్తింపు

జిల్లాలోనే ధర్మవరం మార్కెట్ యార్డుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి రైతులు ఎక్కువగా వేరుశనగ, కంది, వరి, కూరగాయాలు, ఉద్యానవన పంటలను సాగుచేస్తారు. రైతులు పండించిన పంటలను మార్కెట్ తీసుకువచ్చి గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ఇక్కడ నిల్వ చేసుకోవచ్చు. ఒకవేళ మార్కెట్‌లోనే వ్యాపారులకు అమ్ముకోవాలనుకున్నా.. లేదా ప్రభుత్వమే కొనుగోలు చేసినా.. రైతులకు ఉపయోగకరంగా ఉండేది. యార్డ్‌కు చైర్మన్ ఉండటంతో గ్రామాల్లో రైతులతో సత్సంబంధాలు ఏర్పరుచుకొని... మార్కెట్ ఆదాయానికి దోహదపడేవారు.

● భారీగా ఆదాయం

ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆదాయం ఈ ఏడాదికి రూ.64లక్షల వరకు టార్గెట్ పెట్టుకున్నట్లు మార్కెట్ అధికారులు తెలుపుతున్నారు. మార్కెట్ యార్డు పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాలు వర్తిస్తాయి. ఈ మార్కెట్ పరిధిలో బత్తలపల్లి, రాళ్లఅనంతపురం రెండు చెక్‌పోస్టులు ఉన్నాయి. చెక్‌పోస్టులు, మార్కెట్‌లోని గోదాములు బాడుగలు తదితర వాటి నుంచి ఏడాదికి రూ.64లక్షల ఆదాయాన్ని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఎంపికపై కసరత్తు

ధర్మవరం మార్కెట్‌యార్డు చైర్మన్ స్థానం బీసీ మహిళకు రిజర్వేషన్ ఖరారు అయింది. ప్రజా ప్రతినిధి ఆమోదం మేరకు చైర్మన్ ఎంపిక కోసం కసరత్తు ప్రక్రియ ప్రారంభిస్తాం. ప్రజాప్రతినిధుల ఆమోదం మేరకు ఎంపిక పూర్తిచేస్తాం.

-నరసింహమూర్తి, ఏడీఎం, జిల్లా మార్కెటింగ్ అధికారి

ఉత్సాహంగా షటిల్ టోర్నీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ధర్మవరం,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆలిండియా లాయర్ యూనియన్ ఆధ్వ ర్యంలో కళాజ్యోతిలో ఆదివారం నిర్వహించిన ధర్మవరం ఎంప్లాయీస్ మెగా షటిల్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. విజేత పోలీసు జట్టుకు కృష్ణమోహన్, రాజాలకు గొర్తిభారతీదేవి, గొర్తి సుధాకర్‌నాయుడు రూ.10 వేలు, షీల్డ్ అందజేశారు. రెండో విజేత ఉపాధ్యాయుల జట్టుకు టీడీపీ నాయకులు పల్లెంకృష్ణ రూ.5వేలు, షీల్డ్ అందజేశారు. టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు అందరికీ వైఎస్ఎల్ ఎంటర్ ప్రైజెస్ ఎర్రజోడు చంద్రశేఖర్ షీల్డ్స్ అందజేశారు. ఇందులో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆదిశేషు కళాజ్యోతి కమిటీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, బార్ అసోషియేషన్ కార్యదర్శి విజయరాఘవేంద్ర, ఆలిండియా లాయర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా సీసీ రోడ్డు నిర్మాణం

ఇళ్లముందు నిలిచిన నీళ్లు.. అధికారుల పర్యవేక్షణ కరువు.!



ఇళ్ల ముందు నిలిచిన నీరు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామంలో సీసీ రోడ్డును హెచ్చుతగ్గులుగా నిర్మించారు. దీంతో నీళ్లన్నీ ఇళ్లముందే నిలిచి పోతున్నాయని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం వేసిన సీసీ రోడ్డు ఒక ప్రాంతంలో ఎత్తుగా.. మరో ప్రాం తంలో తగ్గుగా వేశారు. దీంతో రోడ్డుకు పెట్టిన నీళ్ల అన్నీ.. తగ్గు ప్రాంతంలోకి వచ్చి నిల్వ ఉంటు న్నాయి. రోడ్డు పక్కన డ్రైనేజీలు కూడా లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వల్లే ఆ పరిస్థితి ఏర్పడిందని వారు మండిపడుతున్నారు. దీనిపై పంచాయతీ రాజ్ మండల ఇన్‌చార్జి జేఈ వంశీని వివరణ కోరగా.. ఈ సమస్యను గ్రామస్థులు తన దృష్టికి తీసుకొచ్చారని, దీంతో గ్రామానికి వెళ్లి పరిశీలించామని చెప్పారు. కొలతల ప్రకారమే రోడ్డు నిర్మించారని, ఒక చోట నీళ్లు నిల్వ ఉంటున్నాయని, కాంట్రాక్టర్‌తో దానిపై మాట్లాడామని, ప్రజలకు సమస్య లేకుండా పరిష్కరిస్తామని చెప్పారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడంపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో కోదండరామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు పంచరత్న సురేష్ శర్మ గణపతి, హనుమ, నవగ్రహహోమాలు నిర్వ హించారు. సాయంత్రం పునఃపూజ, వేదపారాయణ, జప పారాయణం, ప్రదోషకాల పూజలు తదితర వాటిని నిర్వహించారు. ఆలయంలో సోమవారం సీతారామలక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఏ రవూఫ్‌కు ఘన నివాళి

కదిరిలీగల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఉద్యమ నేత ఎస్ఏ రవూఫ్ 11వ వర్ధంతి సందర్భంగా కుటాగుళ్ల ఘాట్ వద్ద ఆదివారం పలువురు నివాళులర్పించారు. మొదట ఆయన కుటుంబసభ్యులు వి గ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ప్రముఖ న్యాయ వాదిగా అనేక అవకాశాలు ఉన్నా పేద ప్రజల అభ్యున్నతి కోసమే తన జీవి తాన్ని అంకితం చేసిన త్యాగ ఘనుడు అని అభిమానులు కొని యా డారు. నివాళులర్పించిన వారిలో అనంతపురం బాషా అలీ ఖాన్, స్థాని కులు రామన్న, హనమంతు, వెంకటేశు, ప్రసాద్, గోవిందు ఉన్నారు.



ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కేసు నమోదు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి సమీపంలో ఓ యువకుడిపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. రెండురోజుల క్రితం పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన దినేష్ తన స్నేహితులు మధు, సుదీర్, నవీన్‌లతో కలిసి రేగాటిపల్లి గ్రామసమీపంలో పొలాల వద్దకు మద్యం సేవించేందుకు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తుండగా ఎర్రగుంటకు చెందిన విజయ్ అక్కడికి వచ్చి దినేష్‌తో డబ్బు విషయమై గొడవ పడ్డాడు. దినేష్ తలపై కొట్టడంతో అతనికి తీవ్ర గాయమైంది. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు అతన్ని కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలిపై దాడి



గాయపడిన నాగలక్ష్మి

కొత్తచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలసముద్రం గ్రామంలో మానేని నాగలక్ష్మిపై వైసీపీ కార్యకర్త, మాజీ వలంటీర్ కాయల అనిల్ శనివారం రాత్రి దాడి చేశాడు. నాగలక్ష్మి తన ఇంటి వద్ద పాత్రలు శుభ్రం చేయడంతో ఆ నీరు తమ ఇంటి ఎదుటకు వస్తున్నాయంటూ దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు అనిల్‌పై కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



పట్నంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కదిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కదిరి రూరల్ మండలం పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. నాటి గురువులను సన్మానించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు





స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ధర్మవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఆదివారం పలు పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, లక్ష్మీవెంకటేశ్వర కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారిని పల్లకీలో ఆలయ ఆవరణంలో ఉదయం హంసవాహనం, సాయంత్రం హనుమత్ వాహనంలో ఊరేగించారు. ఈ కార్యక్రమాలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

షాదీమహాల్ నిర్మాణాలు చేపడతాం: ఎమ్మెల్యే

తనకల్లు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ముస్లిం మైనార్టీల కోసం షాదీమహాల్ నిర్మాణాలు వచ్చే యేడాది లోపు నిర్మిస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని మండ్లిపల్లి మిట్ట వద్ద ఉన్న ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకల్లు, కొక్కంటి క్రాస్‌లోని షాదీమహాల్ ఎక్కడ నిర్మించాలో నిర్ణయిం చుకోవాలన్నారు. సమావేశానికి హాజరైన మైనార్టీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కొర్తికోట మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ఎస్‌కె మస్తాన్‌వలీ భోజన వసతి ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ముత్తావ లీలు సుబహాన్, హాజీత్ ఫక్రుద్దీన్‌సాబ్, రెడ్డిబాషా, మౌజన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

క్రైం న్యూస్ ..

హెడ్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు





గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు, నారాయణ నాయక్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ నారాయణ నాయక్ (57) రోడ్డు ప్రమాదంలో గాయపడి.. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. ఆదివారం అతని అంత్యక్రియలను స్వగ్రామమైన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించారు. ఆయన 1993లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించేవారు. ఆయనకు భార్య శాంతాబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలలో అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్, పుట్టపర్తిరూరల్ ఎస్ఐ లింగన్న, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సురేశ్‌కుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ సభ్యుడు సాకేత్రి లోక్‌నాథ్, బంధువులు పాల్గొన్నారు.

దుకాణం దగ్ధం.. రూ.15 లక్షల నష్టం



దుకాణంలో చెలరేగుతున్న మంటలు

కదిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వలీసాబ్ రోడ్డులోని ఫక్రుద్దీన్‌కు చెందిన గెలాక్సీ మొబైల్‌షాపులో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఎప్పటిలాగానే ఆదివారం షాపు తెరచి టిఫెన్ చేయడానికి బయటకు వెళ్లారు. ఈలోపు సెల్‌ఫోన్ షాపులో షార్ట్ షర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్ని మాపక సిబ్బంది వచ్చి ఆ మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో రూ.15 లక్షల విలువ చేస్తే సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు ఫక్రుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బాధితుడ్ని పరామర్శించి, ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఇంట్లో అగ్ని ప్రమాదం



కాలిపోయిన సామగ్రి

ధర్మవరం,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవనగర్‌లో నివాసముంటున్న బాషా ఇంట్లో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. అతను తన కుటుంబ సభ్యులతో వరండాలో పడుకొని ఉండగా.. అర్ధరాత్రి వంట ఇంట్లో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై.. స్థానికుల సాయంతో ఆ మంటలు ఆర్పివేశారు. వంట ఇంటిలోని వస్తువులు, ఫ్రిజ్, సరుకులు పూర్తిగా కాలిపోయాయి. బాధితుడు మాట్లాడుతూ.. గుర్తుతెలియని దుండగులు రాత్రి వంటింటి గవాక్షిలో నుంచి పెట్రోల్ పోసి.. నిప్పు పెట్టారని, దీంతో ఈ ప్రమాదం జరిగిందని, దాదాపు రూ.రెండు లక్షల నష్టం జరిగిందని వాపోయాడు. టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, వార్డు ఇన్‌చార్జ్ గంగారపురవి, నాయకులు బాధితునికి నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు.

జూదరుల అరెస్ట్

ధర్మవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూడ్‌షెడ్‌కొట్టాల శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆదివారం తెలిపారు. టూటౌన్ ఎస్ఐ విజయానాయక్, తన సిబ్బందితో దాడులు నిర్వహించి వారిని అరెస్ట్ చేశారని, వారి నుంచి రూ.27,320 స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా కోడి రంగనాథస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

లేపాక్షి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): శిరివరం గ్రామంలో వెలసిన కోడిరంగనాథస్వామి రథోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామివారిని ఆసీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచేకాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం అన్నదాన కార్యక్రమాలను గ్రామస్థులు నిర్వహించారు.

ఎన్డీఏ హయాంలోనే ముస్లింల అభివృద్ధి



మసీదు ప్రారంభోత్సవంలో గుండుమల

మడకశిరటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని జామియా మసీదు ప్రారంభోత్సవం సందర్భంగా గుండుమల మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబునాయుడు ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం కూడా ఆయన ఆ విధానాలకు కట్టుబడి ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్.బి.నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వై.టి.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు భక్తర్, కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో ముఖ్యం



బెల్టు టెస్టుకు హాజరైన మాస్టర్లు, విద్యార్థులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మ రక్షణకు కరాటే విద్య ఎంతో ముఖ్యమని గౌరిబిదనూర్‌కు చెందిన మాస్టర్ శ్రీనాథ్ పేర్కొన్నాడు. ఆదివారం మండలపరిధిలోని కిరికెర ఎల్‌ఆర్‌జి పాఠశాలలో సీనియర్ కరాటే మాస్టర్ రఫీక్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్టును నిర్వహించారు. ముఖ్యంగా బాలికలు తమను రక్షించుకునే విధంగా శిక్షణ పొందాలని అందుకు విద్యాలయాలు, తల్లి తండ్రులు సహకరించాలన్నారు. ఈ బెల్ట్ టెస్టులకు 87 మంది హాజరు కాగా అందులో 48 మంది ఎల్లో బెల్టు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే శిక్షకుడు రియాజ్‌బాషా, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సోమందేపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎన్నికల వేళ ఇచ్చిన మాటను బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖా మంత్రి సవిత మాట నిలుపుకున్నారని టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, కన్వీనర్ సిద్దలింగప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో కొనసాగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు కార్యక్రమాన్ని స్థానిక నేతలతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కిందన్నారు.ప్రజలకు ఇచ్చే ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్నారు. ఆయన అడుగు జాడల్లో మంత్రి సవిత నియోజకవర్గ అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డి సురేష్, సూర్యనారాయణ, శ్రీరాములు, శివశంకర్, జనార్ధన్, శ్రీనివాసులు, మద్దిలేటి, రామాంజి, పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..



తవ్వి వదిలేసిన గుంత

హిందూపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులోంచి మహిళా డిగ్రీ కళాశాలకు వెళ్లే రహదారిలో నాలుగు రోజుల క్రితం మురుగు నీరు ఆగిందని మరమ్మతుల కోసం రెండు చోట్ల తవ్వి వదిలేశారు. దీనివల్ల ఆ ప్రాంతంలో నివాసమున్నవారు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతలు పూడ్చాలని ఆ వీధిలోనివారు కోరుతున్నారు.

బీసీ కులాలను ఆదరిస్తున్నది టీడీపీనే..

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అణగారిన బిసి కులాలను ఆదరించి వారిని ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా చైతన్య పరుస్తున్నది తెలుగుదేశం పార్టీనే అని వడ్డెర కుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని శ్రీకంఠపురం సుంకలమ్మ దేవాలయం వద్ద వడ్డెర కులస్తులు నూతనంగా చైర్మెన్ పదవి అధిరోహించిన డి.ఇ. రమేష్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మంజుల దుర్గానవీన్‌లు మాట్లాడుతూ.. బీసీలకు అండగా నిలిచేది టీడీపీయేనని అన్నారు. కార్యక్రమంలో రంగప్ప, ప్రసాద్, సునీల్, వెంకటేష్ కెంచప్ప, దుర్గా నాని, గంగాధర్, శివ, గోవిందప్ప, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

లేపాక్షి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం లేపాక్షిలో ప్రతియేడాది ఎంతో వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి వేడుకలపై ఆదివారం మండల టీడీపీ కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బాలకృష్ణ సూచనమేరకు మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామ న్నారు. ఈనెల 25నుంచి మార్చి1 వరకు ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఐదు రోజులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓనరసింహమూర్తి, సర్పంచ్ ఆదినారాయణ, ఆలయ అర్చకులు కమిటీ సభ్యుడు మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

అతీగతీ లేదు..!


- సమస్యలపై కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు
- నేడు మడకశిరలో జిల్లాస్థాయి పరిష్కార వేదిక

మడకశిర రూరల్ ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు ఉన్నవారు సోమవారం వచ్చిందంటే తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లాకలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమాలకు పరుగులు తీస్తున్నారు. వారి సమస్యలపై గ్రీవెన్స్‌డే కార్యక్రమాల్లో అర్జీలు అందజేసి వస్తున్నారు. వారి సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో కూడా పేర్కొంటూ అక్కడ రసీదులు కూడా ఇస్తున్నారు. ఇంకేముంది తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మి అమాయకులైన గ్రామస్థులు ఇంటికి తిరిగి వస్తున్నారు. తమ అర్జీలపై త్వరలోనే చర్యలుంటాయని ఎదురుచూస్తుంటారు. కాని ఏళ్లు గడుస్తున్నా ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. రెవెన్యూ సదస్సులు పెట్టినా, ప్రజాదర్బారు సభలు నిర్వహించినా మళ్లీ అవే సమస్యలతో హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మడకశిరలో కలెక్టర్ ఆధ్వర్యంలో జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికతీరు పట్ల పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.



పాసుపుస్తకాన్ని చూపుతున్న హనుమక్క

మడకశిర పట్టణం రెండోవార్డు వజ్రపాళ్యం గ్రామానికి చెందిన హనుమక్క అనే ఒంటరి మహిళ భూ సమస్యలతో ఎన్నో ఏళ్లుగా తహసీల్దార్, ఆర్డీఓ జిల్లాకలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న గ్రీ వెన్స్ డే కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉంది. బాధితురాలు హనుమక్క మాట్లాడుతూ 'నా భర్త చనిపోయారు. పిల్లలు పట్టించుకోవడంలేదు. మా తండ్రికి మగ సంతానంలేదు. ఇద్దరూ ఆడబిడ్డలం. మా తండ్రి వీలునామా ద్వారా తనకున్న ఆస్తిని పంపిణీ చేశారు. దానిప్రకారం నాకు మండలంలోని మెళవాయి గ్రామసచివాలయ పరిధిలో సర్వే నెంబర్ 155-2సిలో 0.79 సెంట్లు, 156-6లో 0.90 సెంట్లు మా తండ్రి నుంచి సంక్రమించింది. ఆ భూమిని సర్వేచేసి సబ్ డివిజన్ చేయాలని 2024లో రూ.550 సర్వే ఫీజ్ కింద ఆన్‌లైన్‌లో చలానా చెల్లించా. భూమిని సర్వేచేయాలని దరఖాస్తు కూడా ఇచ్చాను. ఏడాది కావస్తున్నా రెవెన్యూ అధికారు, సర్వేయర్లు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయమై జనవరి 6న పుట్టపర్తికి వెళ్ళి గ్రీ వెన్స్‌డేలో కలెక్టర్‌కి అర్జీ ఇచ్చా. ఫిబ్రవరి 6 తేదీలోగా సమస్య పరిష్కరిస్తామని రసీదు కూడా ఇచ్చారు. నెల రోజులు పూర్తి అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.'



PGRS - Monday Mandal Level
Sri Satya Sai

Grievance No	SSTS202501068219	అర్జీ నమోదు తేదీ	06-01-2025
అర్జీ విభాగము	Survey Settlements And Land Records-->Patta Sub Division->Patta Sub Division & Incorporation In Survey Records		
పేరు	HNUMAKKA	ఫోను	8008925676
జిల్లా	Sri Satya Sai	మండలము	Madakasira
సచివాలయము	MELAVOI-(R), 11290643	ప్రస్తుత నివాసం	2-68, 2-68, NEWSCCOLONY-(U), 21154003, Madakasira, Sri Satya Sai
పరిష్కరించు అధికారి	Tahsildar, Madakasira		
గడువు	30 Day(s)	పరిష్కరించు గడువు తేది	05-02-2025

జనవరి 6న కలెక్టరేట్‌లో ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించిన రసీదు

ఇలాంటి సమస్యలనే పలువురు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం సమావేశం జరిగినంతసేపు దాని గురించి మాట్లాడతారు. అనంతరం ఆ ఊసే ఎత్తుకోవడంలేదు. సోమవారం మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్‌డేలోనైనా తమ సమస్యలు పరిష్కామవుతాయని వారు ఎదురుచూస్తున్నారు.

వంతెనపై గుంతలకు మరమ్మతులు

గోరంట్ల, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని హిందూపురం ప్రధాన రహదారిలో చిత్రావతి వంతెనపై ఏర్పడిన గుంతలు ప్రాణాంతకగా మారడంతో టీడీపీ నాయకులు సొంత ఖర్చుతో ఆదివారం వాటికి మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో మంత్రి పదవినుంచి వైదొలగుతున్న సమయంలో అధికారులపై వత్తిడి తెచ్చి అప్పటి మంత్రి శంకరనారాయణ వంతెన పనులను త్వరగా పూర్తి చేయించారని, దీంతో వారు నాసిరకంగా పనులు చేపట్టారన్నారు. ఆయన 2022 మార్చి 6న హడావుడిగా వంతెన ప్రారంభించిన విషయం తెలిసిందేనని, నాసిరకం పనుల వలన వంతెన గుంతలమయం కావడంతో ఇనుక కడ్డీలు బయటపడి రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు.. ఇటీవల మంత్రి సవితకు, అధికారుల సమీక్షలో టీడీపీ నాయకులు వంతెనపై ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్‌అండ్‌బి ఈఈ సంజీవయ్య స్పందిస్తూ ఇది ఎన్‌హెచ్‌పరిధిలోకి వస్తుందని సమాధానమిచ్చారు. గుంతలు ఏర్పడి వంతెనపై ప్రమాదాలు .జరుగుతుండడంతో స్పందించిన టీడీపీ నాయకులు సొంత ఖర్చుతో కంకర, సిమెంటు, నీటి ట్యాంకర్ తెప్పించి వంతెనపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేయించారు. కొత్త వంతెన ఏర్పాటుతో పాత వంతెన అధ్వానంగా మారిందని, మంత్రితో మాట్లాడి పాత వంతెన బాగు చేయిస్తానని శ్రీధర్ తెలిపారు. దీంతో రెండు వంతెనలు ఉపయోగంలోకి వస్తే ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. అలాగే పట్టణంలో ప్రధాన సిమెంటు రోడ్డుపై గుంతలకు కూడా త్వరలోనే మరమ్మతులు చేయిస్తానన్నారు.



వంతెనపై గుంతలకు మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

వామ్మో! గ్రామ సింహాలు

వీధికుక్కల బెడదతో భయపడుతున్న ప్రజలు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నానెప్పనగర్, లక్ష్మీపురం, డీబీ కాలనీల్లో గ్రామ సింహాలు చెలరేగిపోతున్నాయి. పదుల సంఖ్యలో వీధికుక్కలు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. పొరపాటున అటుగా చిన్న పిల్లలు, వృద్దులు వస్తే మీదపడి కరవడం ఖాయం. వాహనంలో ఎవరైనా అటుగా వెళ్తుంటే వెంటబడుతున్నాయి. పలువురు కుక్కల దాడిలో గాయపడి ఆసుపత్రికి చికిత్సకు వెళ్తున్నారు. ఇటీవల కొన్ని నెలల క్రితం దండురోడ్డులో ఓ పిల్ల వాడిమీద కుక్క దాడి చేసి గాయపరిచింది. అదే విధంగా హస్నాబాద్‌లో కుక్కల దాడిలో ఓ వృద్ధుడు గాయపడి ఆసుపత్రిలో చేరాడు. ఈ విషయంపై వివరణ కోరుదామని మునిసిపల్ కమిషనర్‌కు ఫోన్ చేస్తే ఆయన స్పందించలేదు.



నానెప్పనగర్‌లో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

గోరంట్ల :పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గోరంట్లలో మాంస విక్రయకేంద్రాలు నిర్దిష్టమైన ప్రదేశంలోకాకుండా ఎక్కడబడితే అక్కడ ఏర్పాటవుతున్నాయి. మాంస వ్యర్థాలకోసం కుక్కలు ఆయా ప్రాంతాల్లో ఉంటూ కడుపు నిండగానే రోడ్లపై వీరవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని మసీదుసర్కిల్, బస్టాండ్ కూడలి. సంతమార్కెట్‌వీధి, గాంధీసర్కిల్, పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాలలో 15నుంచి 20 కుక్కలవరకు గుంపుగా సంచరిస్తున్నాయి. రాత్రి సమయంలో రోడ్డుపైనే ఉంటూ ద్విచక్రవాహనాలు, కార్లను వెంబడిస్తున్నాయి. చిన్నారులతోపాటు పెద్దలు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల చుట్టు తిరుగుతున్నారు. ఈవిషయం ప్రధానంగా చర్చకు రావడంతో మండల సర్వసభ్య సమావేశంలో కుక్కలపై చర్యలకు పంచాయతీ ఉత్సాహం చూపినా, తరువాత మౌనం వహించింది. కుక్కల సంతతిపై నియంత్రణ లేక క్రమంగా వారి సంఖ్య పెరిగిపోతోంది. మూగజీవాలపై చర్యలు చేపడితే జంతు సంరక్షణకారులనుంచి వ్యతిరేకత ఎదురవుతుందని అధికారులు స్పందించడంలేదు. సంబంధిత మునిసిపల్, పంచాయతీ అధికారులు మాంస విక్రయాలకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటుచేసి కుక్కల బెడదనుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గోరంట్ల, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1974-74లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. అందరూ 50 సంవత్సరాల తరువాత తాము చదివిన పాఠశాలలో చేరి సర్ణోత్సవాలు జరుపుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ స్థితిగతులు తెలుసుకుని బాల్యంలో చోటుచేసుకున్న జ్ఞాపకాలు నెమరు వేసుకుని ఆనందించారు. అప్పటి గురువులు రఘురామిరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరమణలతోపాటు ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం మాధవిలతను శాలువా, పూలమాలతో నూతన వస్త్రాలతో సత్కరించి, వారి ఆశీర్వాదాలు పొందారు. పాఠశాలకు ఆరు టేబుల్స్, మైక్రో ఫోన్‌ను అందించారు. పూర్వ విద్యార్థి ప్రొఫసర్ గాయత్రి పాఠశాల టాపర్‌గా నిలిచిన మానస అనే విద్యార్థికి రూ. పదివేల నగదు బహుమతి అందచేస్తూ, ప్రతియేటా ఉన్నత చదువులకోసం సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కొండాపురం సోముశేఖర్ పాఠశాల అభివృద్ధికి అవసరమైన వసతులకోసం రూ.1.16లక్షలు విలువ చేస్తే సామాగ్రి అందిస్తానని హామీ ఇచ్చారు.



గోరంట్లలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దేశ భవిష్యత్తు.. విద్యార్థుల చేతుల్లోనే..



మోటివేషన్ క్లాస్‌కు హాజరైన విద్యార్థులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని లైఫ్ అండ్ బిజినెస్ కోచ్ వేణుకళ్యాణ్ పేర్కొన్నారు. పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా స్థానిక సువర్ణభారతి విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఈడిగ ప్యాలెస్‌లో సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులో ఆత్మస్థైర్యం పెంపొందించే దిశగా వారిని ఉత్తేజ పరిచే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా మాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకుని దేశం గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఎలా చదవాలి అనే ప్రణాళికను రూపొందించుకొని ఏకాగ్రతతో చదివితే విజయం బానిసవుతుందని వివరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మెన్ నీలకంఠారెడ్డి, ఏఓ అనీల్‌కుమార్, లోటస్ స్కూల్ డైరెక్టర్ ప్రజిత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పెనుకొండ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు ఉచిత అన్నదానం నిర్వహించారు. ఆదివారం స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద నారాయణసేవ కార్యక్రమంలో భాగంగా సేవాసమితి సభ్యులు వారపుసంతకు వచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. ఇందుకు కీర్తిశేషులు మాదమ్మ, ముత్యాలప్ప జ్ఞాపకార్థం వారి కొడుకు, కోడళ్లు నరసింహులు, రాజేశ్వరమ్మ దంపతులు సహకారం అందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

పావగడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చట్టానికి వ్యతిరేకంగా అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం కల్పిస్తే, అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని మధుగిరి డీవైఎస్పీ మంజునాథ్ తెలియపరిచారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన దళిత హితరక్షణ సమితి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాలూకా వ్యాప్తంగా మట్కా, జూద కేంద్రాలు, అక్రమ ఇసుక రవాణా తదితర చట్ట వ్యతిరేక పనులు పోలీసులు స్వయంగా తోడై నిర్వహిస్తున్నారని తమకు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని చట్టాలపై నమ్మకం ఉండాలంటే పోలీసులు సక్రమంగా పనిచేయాలన్నారు. దళిత హితరక్షణ సమితి, జిల్లా అట్రాసిటీ కేస్ సభ్యుడు డిజే ఎస్ నారాయణప్ప కొన్ని పోలీస్ స్టేషన్‌లలో దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఏకపక్షంగా తప్పుదోవ పట్టిస్తున్నారన్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ క్రైమ్ ఎస్ఐ విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీలు ఇచ్చుకోండి..

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యల పరిష్కారానికి సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మె ల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ఆయన ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు నిర్వహించే ఈ వేదిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చేతన్‌తోపాటు జిల్లా అధికార యంత్రాంగం హాజరుకానున్నట్లు తెలిపారు. సమస్యలను అర్జీల రూపంలో అందించి, పరిష్కారం పొందాలని సూచించారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఉష

సోమందేపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విఫలమైందనీ, వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలవడం ఖాయమని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష పేర్కొన్నారు. ఆదివారం మండంలోని మేకలపల్లి గ్రామంలో నిర్వహించిన గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలిసి ఆమె సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పనితీరుపై ఆరాతీశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో చంద్రబాబు విఫలమయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో తాము తిరిగి అధికారంలోకి రాబోతున్నామని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలకార్మికుడితో పనిచేయించిన అంగన్‌వాడీలు

గోరంట్ల, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూగానిపల్లి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పరిసరాలను ఓ బాలకార్మికునిచే నిర్వాహకులు ఆదివారం శుభ్రంచేయించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల చుట్టు స్వచ్ఛత పాటిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని జిల్లాకలెక్టర్ ఇటీవల ఆదేశించారు. దీంతో బూగానిపల్లి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ గడ్డి, పిచ్చిమొక్కలుండడంతో వాటిని తొలగించే బాధ్యతను కార్యకర్తలు అదే గ్రామానికి చెందిన బాలుడికి అప్పగించారు. గ్రామస్థులు వీడియో తియడంతో సోషియల్ మీడియాలో అది వైరల్ అయింది. ఈవిషయంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజితను వివరణ కోరగా తనకు అధికారులనుంచి ఆదేశాలు అందాయని, సోమవారం సంఘటనపై విచారణ జరుపుతానన్నారు.

గరుడవాహనంపై శ్రీవారు



గరుడవాహనంపై ఊరేగుతున్నశ్రీవారు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పేట శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆరవ రోజు శ్రీవారు గరుడవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గోవిందనామ స్మరణతో మేళాతాళాలు మంగళవాయిద్యాలు నడుమ పల్లకిలో ఊరేగారు. కొల్హాపురమ్మ ఆలయం వద్ద వరకు వెళ్ళి తిరిగి వచ్చారు. శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తుల దర్శనమిచ్చి అనుగ్రహించారు.

రైతులు పేర్లను నమోదు చేసుకోవాలి

గుడిబండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూములు కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ వీరనరేష్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటలబీమా, పంట రుణాల వడ్డీరాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, బిందు తుంపర సేద్యం, పంట రుణాలు, పెట్టుబడిసాయం తదితర వాటిని అందించేందుకు రైతు గుర్తింపు సంఖ్య నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్లి రైతు ఆధార్‌కార్డు, ఆధార్‌నెంబర్, ఫోన్‌నెంబర్, పట్టాదారు పాసుపుస్తకం తదితర వాటిని తీసుకెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ రైతులకు సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన ఆంజనేయులు(40) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. అతడు పెనుకొండ ఇటుకల బట్టీలో కూలిపనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణం కూడా ప్రారంభించాడు. తాగుడుకు బానిసై అప్పులు అధికమై ఇంట్లో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గొడవపడి స్టేషన్‌కు వచ్చాడని సర్దిచెప్పి పంపామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మనస్థాపానికి గురై కొత్త ఇంట్లోనే ఉరివేసుకుని మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య మహేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వివాహిత రూప కుటుంబ కలహాలతో విష ద్రావకం తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. క్రిమిసంహార మందు తాగి అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ ఉష చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

సోమందేపల్లి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన ఓ బాలుడిని పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. చాలకూరు గ్రామంలో రోడ్డుపక్కన ఆదివారం ఒంటరిగా వున్న బాలుడిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రమేష్ కానిస్టేబుల్‌ను పంపించి బాలుడిని పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. వివరాలు తెలియకపోవడంతో బాలుడి ఫోటో సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీతో హిందూపురం ముద్దిరెడ్డిపల్లికి చెందిన నాగరాజు పోలీస్ స్టేషన్‌కు వచ్చి అతను తన కుమారుడని తెలిపారు. దినేష్ సోమందేపల్లిలో వున్న తన మేనత్తను కలవడానికి ఇంటిలో చెప్పకుండా వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో తప్పిపోయాడన్నారు. ఎట్టకేలకు బాలుడిని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.